నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com

భీమారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ



జైపూర్ : రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం రాత్రి భీమారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తలు, పోలీస్ గస్తీ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల తీరు పరిశీలించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్‌స్టేసన్‌కు చేరుకున్న సీపీకి ఎస్సై శ్వేత పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్సై శ్రీధం పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దు

నవతెలంగాణ-సారంగాపూర్



అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా వెళ్లద్దని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని సిరిపెల్లి, భోథ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద పులి అరుపులు వినిపించాయని, అటవీ ప్రాంత సమీప తండా వాసులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. వారం రోజుల నుండి అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు ఆనవాళ్ల సేకరించారని తెలిపారు. ప్రజలెవరూ ఒంటరిగా అటవీ అంచున గల చేనులోకి వెళ్లొద్దని, గొర్రెలు, పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారి రాజశేఖర్, ఎఫ్‌బీఓలు స్వప్న, సుజాత, స్రవంతి, ఫజీల్ హుస్సేన్ పాల్గొన్నారు.

అరకొర వేతనం..అదనపు భారం..!

- సర్వేలతో సతమతమవుతున్న ఆశా కార్యకర్తలు
- నాలుగేండ్లుగా పెండింగ్ బిల్లులకు లభించని మోక్షం
- తాజాగా పారతోషికం లేకుండా బీసీజీ సర్వేకు ఆదేశాలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆశా కార్యకర్తలు

గ్రామీణ పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయి. సర్వేల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరి మాదిరిగా పనిచేయిస్తుండగా.. పనికి తగిన వేతనం మాత్రం ఇవ్వడం లేదు. అరకొర వేతనం అందిస్తూ అదనపు పని భారం మోపుతోంది. ఇప్పటికే పనులతో సతమతమవుతున్న తమకు సర్వేల పేరుతో మరింత పని భారం మోపుతోందని ఆశా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు సర్వేలు చేసినప్పటికీ..వాటి తాలుకు పారతోషికం ఇప్పటికీ దరిచేరడం లేదని వాపోతున్నారు. తాజాగా బీసీజీ సర్వే చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం..ఈ సర్వేకు ఎలాంటి పారతోషికం ప్రకటించకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఈ సర్వేను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రతి నిత్యం గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలు పనిభారంతో సతమవుతున్నారు. ప్రమాదకర కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో ప్రజలకు తామున్నామంటూ.. ధైర్యంగా వైద్య సేవలందించి అందరి ప్రశంసలు పొందిన ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వ ధోరణి ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికే అనేక పనులు చేయిస్తూ అదనపు పనిభారం మోపుతుండగా.. ప్రభుత్వాలు చేపడుతున్న పలు సర్వేల్లోనూ భాగస్వామ్యం చేస్తున్నారు. వివిధ వ్యాధుల గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వేలన్ని వీరితోనే చేయిస్తున్నారు. గర్భిణీలను ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించడం మొదలు చిన్నారులకు టీకాలు వేయడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడం, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారికి ఇంటింటికీ వెళ్లి మందులు అందజేయడంతో పాటు గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ చేపట్టే ప్రతి పనిలో భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది. ప్రతి ఏటా జ్వర సర్వే చేపడుతూ రోగుల ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.9750 చొప్పున పారతోషికం అందించగా.. ఇందులోనూ కోత విధిస్తున్న సందర్భాలుంటున్నాయి.

గత సర్వేల పారతోషికం ఏదీ..?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో చేయించిన సర్వేల తాలుకూ పారతోషికం ఇప్పటికీ దరిచేరడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 1000 మంది ఆశా కార్యకర్తలు విధులు నిర్వర్తిస్తున్నారు. 2019లో కోవిడ్ సమయంలో వీరు అందించిన సేవలు వెలకట్టలేనివి. కోవిడ్ పాజిటివ్‌గా తేలిన వారికి అవసరమైన మందులు అందించడం.. నిరంతరం వారి ఆరోగ్య సంరక్షణ తెలుసుకుంటూ వైద్యఆరోగ్యశాఖకు సమాచారం అందించేవారు. ఈ సమయంలో కేంద్రప్రభుత్వం ప్రతి నెల రూ.వెయ్యి చొప్పున అదనపు పారతోషికం అందిస్తుందని చెప్పింది. 2019లో కోవిడ్ ప్రారంభమైన తొలి మూడు నెలలు మాత్రమే అందించింది. కోవిడ్ ప్రభావం 2021వరకు కొనసాగగా.. అప్పటి వరకు వీరు సేవలందించారు. కానీ మిగితా రెండేండ్లకు సంబంధించిన పారతోషికం ఇప్పటికీ జమ చేయలేదు. 2022లో కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపునకు సంబంధించి 14రోజుల పాటు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఆ సమయంలో రావాల్సిన రూ.1450 చొప్పున పారతోషికంతో పాటు 2023లోనూ చేపట్టిన పోలియో సర్వే పారతోషికం రూ.950 ఇప్పటికీ వారి ఖాతాల్లో జమ కాలేదు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశాలు(ఫైల్)

క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో కేంద్రం చేపడుతున్న బీసీజీ సర్వేను సైతం ఆశా కార్యకర్తలకు అప్పగించింది. ఇదివరకే గ్రామాల్లో ప్రతి నెలా నలుగురి నుంచి తెమడ(స్పూటమ్) సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు తీసుకెళ్తుంటారు. ఎవరికైనా పాజిటివ్ వస్తే సేకరించిన ఆశా కార్యకర్తలకు రూ.వెయ్యి చొప్పున పారతోషికం ఇవ్వాల్సి ఉండగా గత నాలుగేండ్ల నుంచి ఇవ్వడం లేదని వారు చెబుతున్నారు.

పని భారాన్ని తగ్గించాలి :ఎం.సుజాత, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి



ఇప్పటికే అనేక పనులతో సతమతమవుతున్నాం. మరోపక్క గతంలో చేపట్టిన సర్వేలకు సంబంధించి పారతోషికం ఇప్పటికీ విడుదల కావడం లేదు. బీసీజీకి సంబంధించి ఎలాంటి పారతోషికం ఇవ్వకుండానే సర్వే చేయాలని చెప్పడం సరికాదు. ప్రభుత్వం గత పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పనిభారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.



పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్

ఆశా కార్యకర్తలకు అందించాల్సిన గత సర్వేల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి. పనిభారం తగ్గించడంతో పాటు జాబ్‌ఛార్ట్‌ను విడుదల చేయాలి. ప్రస్తుతం అందజేస్తున్న పారతోషికం వారికి ఎటూ సరిపోవడం లేదు. కనీస వేతనం రూ.26వేలు అందించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సురెన్సు వంటి సౌకర్యాలు కల్పించాలి.

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



నిర్మల్ : సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణపై అధికారులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి 150 గృహాలకు ఒక ఎన్యూమరేషన్ బ్లాకుగా పరిగణించాలన్నారు. ప్రతి ఎన్యూమరేషన్ బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్ అధికారి బాధ్యుడిగా ఉంటారని, కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాక్‌లోని ప్రతి కుటుంబానికి సంబంధించి నిర్దేశించిన అన్ని వివరాలను సేకరించాలని ఆదేశించారు. సేకరించిన అన్ని వివరాలు కచ్చితత్వంతో ఉండాలన్నారు. ప్రతి అధికారి సమయానికి తమకు కేటాయించిన ప్రదేశానికి చేరుకొని సర్వేను ప్రారంభించాలన్నారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంటికి సర్వే పూర్తయినట్లుగా తెలిపే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. సర్వే వివరాల డాటాను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సూపర్వైజర్లు ఎన్యూమరేటర్ అధికారి నిర్వహించిన సర్వేలోని 10శాతం వివరాలను ర్యాండంగా తనిఖీ చేయాలని, సర్వే సమయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తినా పైఅధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు అధికారులకు శిక్షణ ఇచ్చి సర్వేకు సంబంధించి వివరాల నమోదులో సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ గోవింద్, ట్రైనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో గిరిజన కళాకారుల చిత్రకళ ప్రదర్శన



ఉట్నూర్: న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో గిరిజన కళాకారుల చిత్రాకళలను మంగళవారం ప్రదర్శించారు. ఈ చిత్రకళలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సందర్శించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన కళాకారులు రూపొందించిన కళాఖండాలను రాష్ట్రపతి చూసి అభినందించారు. మనుషులకు, ప్రకృతికి మధ్య ఉన్న శాశ్వతమైన అనుబంధం వారి చిత్రాలలో ప్రతిబింబిస్తోందని ఆమె పేర్కొన్నారు. గిరిజనుల గొప్ప కళ, సంస్కృతిని అందరూ అభినందించి ప్రోత్సహించాలని రాష్ట్రపతి ఎక్స్ వేదికగా కోరారు. ఈ చిత్ర కళలలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న గిరిజన విద్యార్థి మడావి అనంద్‌రావ్ పాల్గొని రాష్ట్రపతి చేతుల మీదుకు ప్రశంస పత్రం అందుకోవడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు.

దుస్తువులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస్‌రెడ్డి



ఆలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ రూరల్ మండలంలో కంది శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి ఆదివాసులకు దుస్తుల పంపిణీ చేశారు. దీపావళి పండగకి ముందు ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకునే దండారి సంబరాలలో పాల్గొన్నారు. భోజన విరామం వరకు మామిడిగూడ, దహెగూడ, మెులాల్‌గుట్ట, లొహర, సలాయితండా, సాలెగూడ, కొలామ్ తిప్ప, దార్లొద్ది, తిప్ప, ఖండాల గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్ల ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలందరికి పండగ శుభాకాంక్షలు తెలిపి దుస్తువులు పంపిణీ చేశారు. తాను ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటానన్నారు. గెలిచిన ఎమ్మెల్యే మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఆదివాసీలకు దండారి దీక్ష సందర్భంగా కొత్త బట్టలు పెట్టి సత్కరించడానికి వచ్చానన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందరికి అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, సుధాకర్‌గౌడ్, ఎంఏ షకీల్, భోజారెడ్డి, దేవిదాస్‌చారి, పోరెడ్డి కిషన్, అల్చెట్టి నాగన్న, జంగు పటేల్, భీంరావు, నారాయణరెడ్డి, భూమయ్య, సంటెన్న, సోమన్న, రాజేశ్వర్, భగవాండ్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యం



ఆసిఫాబాద్: ప్రజల సంరక్షణ, సమాజంలో శాంతిభద్రతలే తమ ప్రధాన లక్ష్యమని పట్టణ సీఐ బుద్దే రవీందర్ అన్నారు. పోలీస్ అమరవీరుల [illegible] పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించే దిశగా జిల్లా కేంద్రాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలతో మరింత మమేకం అవుతూ వారి మన్నలను పొందేలా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్ఐ రాజేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



ఆసిఫాబాద్ : నవంబర్ 6 నుండి చేపట్టే రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు నిర్దేశించిన నిబంధనల ప్రకారం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలు అన్ని అంశాలను క్రోడీకరించాలని తెలిపారు. సర్వేతో కుటుంబ పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని, అంతే మనసుపెట్టి సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. నిర్దేశించిన సమయంలో సర్వే పూర్తి చేయడంతో పాటు తప్పులు లేకుండా చేయాలన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి

- సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభల్లో పలు తీర్మానాలు

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా మహాసభలు జరిగాయి. చివరి రోజు ప్రతినిధుల సభలో పలు తీర్మానాలు ఆమోదించారు. వాటిని బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్ మీడియాకు తెలియజేశారు. జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు స్థాపించాలని తీర్మానించారు. జిల్లాలో పోడు భూములు, సాగుకు ఉపయోగ పడే భూమి సుమారు 2.5లక్షల హెక్టర్లు ఉందని, నీటి వనరులు ఉన్నా పాలకుల ముందు చూపు, సరియైన ప్రణాళిక లేకపోవడంతో జిల్లా వెనుకబడి ఉందని తెలిపారు. జిల్లాలోని గొలుసుకట్టు చెరువులను ఆక్రమణల నుండి కాపాడాలని, చెరువుల పూడిక తీసి అభివృద్ధి చేసి మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రూ.200కోట్లతో జిల్లా కేంద్రలో అండర్ డ్రైన్ సిస్టం ఏర్పాటు చేస్తామని పాలకుల మాటలు ప్రకటనలకే పరిమితం చేశారని, వెంటనే దీనిపై దృష్టి సారించాలని తెలిపారు. ఆదిలాబాద్ నుండి వయా నిర్మల్ మీదుగా హైదరాబాద్‌కు రైల్వేలైన్ వెంటనే ఏర్పాటు చేయాలని, దీనివల్ల వాణిజ్య పరంగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సహజ సిద్ధంగా ఉన్న జలపాతాలు, కడెం రిజర్వాయర్, బాసర లాంటి క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు 30 శాతం మాత్రమే గుర్తింపు కార్డులు జారీ చేశారని, వెంటనే అందరికి కార్డులు జారీ చేయాలని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, నెలలుగా స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల కింద వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వలస కార్మికులకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఇంట్లో ఒక్కరైనా బీడీ కార్మికులుగా ఉన్నారని, వారి సంక్షేమానికి పాటుపడాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే 200 పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు.

క్రమశిక్షణ, వృత్తిధర్మంతో పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు



నవతెలంగాణ-హాజీపూర్

పోలీసులు క్రమశిక్షణతో వృత్తిధర్మాన్ని పాటిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మంగళవారం మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ పోలీస్ సిబ్బందితో నిర్వహించిన పోలీస్ దర్బార్‌లో సీపీ మాట్లాడారు. పోలీస్ యూనిఫాం సర్వీస్‌లో ఉండి నిరసనలకు దిగవద్దన్నారు. క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పని చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ప్రత్యేక పోలీస్ విభాగంలోని విధులు కొన్ని దశాబ్దాలుగా అమలు జరుగుతుండగా నిరంతరం అలాగే అమలులో ఉంటాయని తెలిపారు. పోలీస్ దర్బార్ ద్వారా ఎలాంటి సమస్యలున్నా కమాండెంట్లు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. దర్బారులో కొంత మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు బెటాలియన్ విధులతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా సానుకూలంగా స్పందించారు. ఇబ్బందులపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. దర్బార్‌లో బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు, పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-తాంసి



ఆదివాసీ ముద్దు బిడ్డ, పోరాట యోధుడు కుమురం భీమ్ ఆశయ సాధన లక్ష్యంగా పార్టీలకతీతంగా కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో కుమురం భీం విగ్రహ ఆవిష్కరణతో పాటు ఆదివాసీ కమ్యూనిటీ హాల్‌ను డిసిసిబి అధ్యక్షులు భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావుతో కలిసి ప్రారంభించారు. అతిథులకు గుస్సాడి సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కుమురం భీం పోరాట ఫలితంగానే ఆదివాసీ గిరిజనులకు హక్కులు కల్పించబడ్డాయని, వారు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి అవి దోహద పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మనమందరం కృషి చేద్దామని అన్నారు. భీంపూర్ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. జందాపూర్ నుండి కరంజి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో మహోర్ వరకు నిర్మాణానికి కృషి జరుగుతుందని పేర్కొన్నారు. దండారి ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు అందించడం గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు సుధాకర్, రాజు, మాజీ ఎంపీపీ సంతోష్, మండలాల నాయకులు లింభాజీ, పురుషోత్తం, పాండురంగ, అఫ్రోజ్, నారాయణరావు, రాకేష్‌రెడ్డి, రమేష్, బలిరామ్, ఉత్తమ్ రాథోడ్, ధర్మసింగ్, జ్ఞానేశ్వర్, అశోక్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అడ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆర్‌టిసి ఆదిలాబాద్ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియామలైన హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, ఆల్కహాల్ సేవించి వాహనాలు నడపొద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. విహార యాత్రలకు, పిక్నిక్‌లకు రాయితీపై బస్సులను పాఠశాలలకు సమకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిఓలు ఎం.శ్రీనివాస్. పి.మధు, ప్రధానోపాధ్యాయులు ఎం.గుణవంత్‌రావ్, ఉపాధ్యాయులు రాజేష్, వనిత విద్యార్థులు పాల్గొన్నారు.

దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బొజ్జు



తాంసి : భీంపూర్ మండలంలోని రాంపూర్ గ్రామంలో దండారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతితిగా పాల్గొని ఎత్మాసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి దండారికి రూ.15వేలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మండలంలోని ఆదివాసీ గూడాలలో దండారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లక్కుగూడ గ్రామానికి వచ్చిన నిజాంగూడ దండారి బృందాన్ని బుధవారం ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం సాగనంపారు. ముందుగా దండారి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారికి సకల మర్యాదలు చేసి కృతజ్ఞతలు తెలుపుతూ సాగనంపారు. గ్రామ పెద్దలతో పాటు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు పాల్గొన్నారు.



మాజీ మున్సిపల్ చైర్మెన్ మృతికి సంతాపం

నవతెలంగాణ-భైంసా



మాజీ మున్సిపల్ చైర్మెన్ దిగంబర్ మాశెట్టివార్ ఇటీవల మృతి చెందడంతో భైంసా మున్సిపల్ పాలకవర్గం, చైర్‌పర్సన్ సభియా భేగం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సంతాపం వ్యక్తం చేశారు. మాశెట్టివార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్ మాట్లాడుతూ 10 సంవత్సరాల పాటు మున్సిపల్ చైర్మెన్‌గా ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. 1981 నుండి 1992 వరకు మున్సిపల్ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కులగణనను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం నవంబర్ నుంచి నిర్వహించే సామాజిక కులగణను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. బుధవారం జడ్పీ పాఠశాలలో కులగణన ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి 16 వరకు గ్రామంలోని ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఫార్మాట్‌లో ఇచ్చిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే ఫారాలను అందజేయాలన్నారు. కార్యక్రమములో ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

'అట్టడుగు వర్గాల అధికారం కోసమే డీఎస్పీ ఉద్భవించింది'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ 90 శాతం అనగారిన వర్గాల పీడిత ప్రజల కోసం వారి ఆత్మ గౌరవం, అధికారం కోసమే ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆవిర్భవించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో పార్టీ జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నవంబర్ 3న హైదరాబాద్‌లోని ఆదిభట్లలో నిర్వహించే కార్యకర్తల మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అగ్రవర్ణ భూస్వామ్య రాజకీయ వ్యవస్థపై యుద్ధం చేస్తూ అట్టడుగు వర్గాల అధికారం కోసం ఉద్యమిస్తున్నామని పేర్కొన్నారు. మాన్యవర్ కాన్షిరాం జయంతి సందర్భంగా గత ఏడాది మార్చి 15,2023న పార్టీ ఆవిర్భవించి ఏడాది గడిచిన సందర్భంగా హైదరాబాదులో డీఎస్పీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ నాయకత్వంలో కార్యకర్తల మహాసమ్మేళనం ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్, బడుగు రాజేశ్వర్, తొంటికూరి సంతోష్, గొంటి ముక్కుల ఒమన్న, దొమ్మటి సురేష్, అగ్గిమల్ల గంగన్న, ఏ.నవీన్, వినుకుమార్, మధు, జ్యోతిరాం ఉన్నారు.

మోడల్ లైబ్రరీని ప్రారంభించిన ఎంఈఓ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. బుధవారం మండల విద్యాధికారి చంద్రకాంత్, నోడల్ అధికారి రాజేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో పఠనశక్తి పెరగాలనే ఉద్దేశ్యంతో ఒకటవ నుంచి ఐదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జడ్ల రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సుంధరగిరి ముత్తాగౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి ప్రవీణ్, ప్రాథమిక పాఠశాల చైర్మన్ తోకల సరస్వతి, పోషకుల చైర్మన్ జీలకరి సాయి ప్రసాద్, వైస్ చైర్మన్ ముజాహిద్, ఉపాధ్యాయులు నాగభూషణ్, సురేందర్, సతీష్, ఆనంద్, గీత, నిఖిత, గ్యాకపు ముత్యం, సాయన్న, భీంరావ్, నిహారిక, ఆరాధన, నిఖిత, శృతి, యశ్వంత్ రావు, గ్రంథాలయ కోఆర్డినేటర్ మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కళాశాల ప్రిన్సిపాల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీవీఎన్ రాజును ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువతో సత్కరించారు. తమ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, చంద్రకాంత్, కునాల్ యాదవ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

దుకాణ సముదాయాలకు రీ టెండర్ వేయాలి

వికలాంగులకు కేటాయించిన మున్సిపల్ దుకాణ సముదాయల వాటి కాల పరిధి ముగిసిందని కావున రీ టెండర్ వేయాలని జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సలీమ్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వికలాంగుల కో ఆర్డినేటర్ సిండే ప్రమోద్ కుమార్, చందవార్ రాకేష్ ఉన్నారు.

పాలక సభ్యులు శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

పట్టణంలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక సభ్యులు శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం అన్నారు. బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య పనులు, కోతుల నియంత్రణ, పార్కు పేరు, అంబేద్కర్ నగర్‌లో నిర్మాణం పూర్తయిన స్మశాన వాటిక ప్రారంభోత్సవం తదితర అంశాలపై ఆయన పాలక సభ్యులతో చర్చించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు కుర్మ శ్రీనివాస్, కిషోర్ నాయక్, జున్నారపు విజయలక్ష్మి, పరిమి లత, ఫౌజియా, కమిషనర్ మనోహర్, కోఆప్షన్ మెంబర్ బండారి కిషోర్ పాల్గొన్నారు.



పారితోషికం లేని సర్వేలు చేయించొద్దు

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- పారితోషికం లేని బీసీజీ సర్వేను రద్దు చేయాలి
- డీఎంహెచ్ఓ ఎదుట నిరసన



డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశాలతో పారితోషికం లేని పనులను చేయించొద్దని, బీసీజీ సర్వేను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సర్వేల బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ప్రధాన జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆశా యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. కనీస వేతనాలు చెల్లించకుండా ఎవరికీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయన్నారు. అరకొర పారితోషికాలతో చేతులు దులుపుకుంటున్నాయన్నారు. పనుల విషయంలో మాత్రం భిన్నంగా ప్రతి కార్యక్రమానికి, సర్వేను ఆశాలతో చేయిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నమని, ఇప్పటికే అనేక పనులు సర్వేలతో ఆశాలు సతమతమవుతుంటే చాలదన్నట్టు బీసీజీ సర్వే పేరుతో మరింత పనిభారాన్ని మోపేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ సర్వే బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న సర్వేల బిల్లులు వెంటనే ఆశాల ఖాతాలలో జమచేయాలి, పెండింగ్ యూనిఫామ్ రిజిస్టర్ల బిల్లులు చెల్లించాలన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే రూ.50 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని యూనిఫామ్ రిజిస్టర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. రిమ్స్‌లో ఆశలకు వెయిటింగ్ రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని ప్రాణాంతక స్పుటమి డబ్బాలు మోయించే పని రద్దుచేయాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించని నేపథ్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఆశా యూనియన్ కార్యదర్శి ఏం.సుజాత కోశాధికారి నాయకులు కాంత రాధ, ఆశా, పద్మ శాంత, దీక్ష, పుష్ప, శ్రీలత, పార్వతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-జైనథ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని పెండల్వాడ ఎంపీపీఎస్‌లో రూమ్ టు రీడ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలు, పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చునని తెలిపారు. తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద మంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో పాటు సుశిక్షులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరుగుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వారా అన్ని మండలాల్లో మోడల్ లైబ్రరీలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో అర్థవంతమైన పఠన సామర్థ్యాలు పెంపొందించి తద్వారా తరగతి వారి కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, తల్లిదండ్రులు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీకాంత్, ఎంఈఓ శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ సారథి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, రూమ్ టు రీడ్ టీం సభ్యులు మహేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలు కాపాడాలి



దండారి బృందానికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ధోతి కట్టుకొని నృత్యం చేసిన బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని బిర్సాయిపేట్, మోతిరాంగూడా, దుర్గాపూర్, యేందా, రాముగూడ, సాలెగూడ, గొట్టి, నర్సపూర్-(బి), పెందూర్ గూడ తదితర గ్రామాల్లో దండారి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్మాసూర్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంప్రదాయ ధోతి కట్టుకొని గుస్సాడీలతో కలసి చచ్చోయ్ కోలాటం ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోవద్దని, యువత కొత్త సంస్కృతులను అవలంబించొద్దని సూచించారు. దండారి ఉత్సవాల్లో డీజేలను పెట్టకుండా ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లకు అనుగుణంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దండారి ఉత్సవాల నిర్వహణకు ప్రతి దండారికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తుందని తెలిపారు. అపంతనం దుర్గాపూర్ దండారికి రూ.15 వేల చెక్కును ఎమ్మెల్యే గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పటేళ్ల, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్ : మండలంలోని ఏజన్సీ గ్రామమైన జామినిలో గుస్సాడి నృత్యాలను విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు తిలకించారు. ప్రతి సంవత్సరం దీపావళి పండగను పురస్కారించుకోని దండారి ఉత్సహలు నిర్వహిస్తారు. ఇతర గ్రామాల నుండి జామిని గ్రామానికి దండారీలు వచ్చి గుస్సాడి నృత్యాలు చేశారు. అతిథ్యానికి వచ్చిన గుస్సాడీలకు గ్రామవాసులు విందు భోజనలతో మర్యాదలు చేశారు. సంస్కృతిని భావి తరాలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్, ఉపాధ్యాయులు జ్యోతి, జయశ్రీ, లక్ష్మణ్, గంగయ్య, పెంటపర్తి ఊశన్న, మునాహిద్, అనుసూయ, పోచ్చిరాం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయ సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్

- ప్రచార పోస్టర్లు ఆవిష్కరించిన జడ్జి



ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఒక్కరికి న్యాయ సాయం అందించాలనే లక్ష్యంతో నేషనల్ లీగల్ సర్వీస్ ఆథారిటి ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశామని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ అన్నారు. బుధవారం డీఎల్ఎస్ఏ కార్యాలయంలో నాల్స ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ 15100 ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జన సంచార ప్రదేశాల్లో వీటిని పెట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయ సాయం, సేవలు అందించాలనే లక్ష్యంతో నేషనల్ లీగల్ సర్వీస్ ఆథారీటి కృషి చేస్తుందన్నారు. న్యాయ సాయం ఎలా పొందాలో ప్రజలకు తెలియదన్నారు. దాని కోసమే ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 15100ను తీసుకువచ్చామన్నారు. ఎలాంటి న్యాయ పరమైన సమస్యలున్న, న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని వారికి ఇది ఉపయోగపడుతుందన్నారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయ సాయం ఎలా పొందాలో చాలా మందికి తెలియదన్నారు. అలాంటి వారి కోసం ఇది దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, దుర్గారాణి, హేస్సెన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈఆర్సీ కమిటీ నిర్ణయం వెనుక బీఆర్ఎస్ పాత్ర

- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిస్కం విజ్ఞప్తి మేరకు ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీలు మోపే ప్రయత్నాలు చేసిన బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఆ నిర్ణయాన్ని ఈఆర్సీ కమిటీ వెనక్కి తీసుకుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. విద్యుత్ చార్జీలను పెంచకుండా ఇటీవల ఈఆర్సీ కమిటీ తీసుకున్న నిర్ణయం వెనుక బీఆర్ఎస్ ప్రధాన పాత్ర ఉందన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పది నెల పాలనలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేల విధానాలను అవలంబిస్తుందన్నారు. డిస్కంల విజ్ఞప్తి మేరకు విద్యుత్చార్జీలను పెంచి రూ.18500 కోట్ల అదనపు భారం మోపేల యత్నించిందన్నారు. దీనిపై ఈఆర్సీ కమిటీ చేపట్టిన అభిప్రాయ సేకరణ, ఇతర సమావేశాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యతిరేకించారన్నారు. బీఆర్ఎస్ విజ్ఞప్తి మేరకు ఈఆర్సీ కమిటీ రూ.18500 కోట్ల అదనపు చార్జీల భారం నుంచి ప్రజలకు విముక్తి కలిటిందన్నారు. తమ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఈఆర్సీ కమిటీకి ధన్యవాదలు తెలిపారు. ప్రభుత్వంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాసం నర్సింగ్, రోకండ్ల రమేష్, యూనీస్ అక్బానీ, సాజిదొద్దిన్, రమేష్, రౌత్ మనోహర్, ప్రహ్లాద్, కుమ్ర రాజు, పరమేశ్వర్, పండ్ల శ్రీను, వేణుయాదవ్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై శిక్షణ

నవ తెలంగాణ-బేల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేని చేపట్టే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. బుధవారం గ్రామ పంచాయతీలోని పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశావర్కర్, బీఎల్ఓ సిబ్బందికీ ఒక రోజు మాస్టర్ ట్రైనార్లతో శిక్షణ ఇచ్చారు. సర్వే ఏ విధంగా నిర్వహించాలి, తీసుకోవాల్సిన ధ్రువపత్రాలు, నమోదు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ శిక్షణ కార్యక్రమని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మనోహర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో 110 ఎన్యూమరేటర్లను నియమించడం జరిగిందన్నారు. నవంబర్ 6 నుండి పదిహేను రోజుల పాటు సర్వే చేపట్టిన తర్వాత మండల కేంద్రంలో కంప్యూటీకరణ చేస్తామన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ కమిటీ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మద్ గ్రామంలో రామ మందిర నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పృథ్వీ రాజ్ పటేల్, వీడీసీ అధ్యక్షులు ఆలూరి శేఖర్ రెడ్డి, నారాయణ, అనిల్, రమేశ్, రాజు, శంకర్, భోజరాం, మాజీ ఎంపీటీసీ గంగాధర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లేట్ల పంపిణీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఎమైకుంట పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. దీంతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశముతో కిచెన్ గార్డెన్ కోసం వివిధ రకాల తీగ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ విధంగా పాఠశాలకు ప్లేట్లతో పాటు మొక్కలను అందజేయడం ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పుప్పాల నరేందర్, ట్రెజరర్ బెజ్జంకి రవీంద్ర, మందా అశోక్, ప్రేమ్ రాజ్ గౌడ్, పాఠశాల చైర్మన్ కేత, ఇన్‌చార్జి హెచ్ఎం కల్పన, ఋుక గంగయ్య ఉపాధ్యాయులు ఇందల్, రోహిదాస్, సాగర్, స్రవంతి, మాజీ సర్పంచ్ లకన్ సింగ్, మాజీ ఎంపీపీ విజయ్ సింగ్, మస్తులు అశోక్, జగన్ సింగ్, అర్జున్ సింగ్, రాందాస్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సీఈఓకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

సహకార సంఘం నూతన ఇన్‌చార్జి సీఈఓ సూర్యవంశీ పంఢరిని దళిత సంఘ నాయకులు బుధవారం శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా అన్నా భావుసాఠె చిత్రపటాన్ని బహుకరించారు. రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో అన్నా భావుసాఠె కమిటీ రాష్ట్ర అధ్యక్షులు నర్సింగ్ మోరే, కోర్రల మహేందర్, జిల్లా కమిటీ సభ్యులు బాలాజీ కాంబ్లే, అనిల్ మోటేరావ్, రాజ్ పంగే సంజీవ్, సుదర్శన్, సౌస్ కాంబ్లే హన్మంత్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com

విద్యుత్ టోల్ ఫ్రీ సేవలు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ వినియోగదారులకు టోల్ ఫ్రీ సేవలు మరింత విస్తృతం చేయడం జరుగుతుందని వీటిని వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండెంట్ ఇంజనీర్ వి.వాసుదేవ్ తెలిపారు. ప్రజలకు టోల్ ఫ్రీ నంబర్ 1912ను అందుబాటులో తీసుకువచ్చామని, నిరంతర సేవలు అందించడంతో పాటు సాంకేతికతను జోడించి సత్వర ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం సిబ్బంది సంఖ్యను పెంచినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫేయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తినా, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులున్న, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యలకు టోల్ ఫ్రీ నంబర్ సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ వినియోగదారుడు ముందుగా 1912కు ఫోన్ చేయగానే ఆ ఫిర్యాదును స్వీకరించి, వివరాలు నమోదు చేసి, సమాచారాన్ని సంబంధిత అధికారికి అందించడంతో పాటు ఫిర్యాదుదారునికి మెసేజ్ రూపంలో అందుతుందన్నారు. ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు సమీక్షించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు.

బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను, ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. చికిత్స పొందుతున్న వారికి మంచి ఆహారాన్ని అందించాలన్నారు. ఆస్పత్రిలో ఉద్యోగులకు మెరుగైన సేవలకు, ఆస్పత్రి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సంబదించిన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె రాజమల్లు, పీఓ నరేందర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ మధు కుమార్ పాల్గొన్నారు.

మత్స్య సంపదను పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నాయని, అందులో భాగంగానే మత్స్యకారులకు ప్రతి సంవత్సరం చేపలు అందిస్తుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో మత్స్యకార సంఘం, జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ మత్స్య సంపదను పెంపొందించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. నాగమ్మ చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరిష్ అధికారి సాంబశివ రావు, బీజేపీ మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, సీనియర్ నాయకులు నీరటి సత్యనారాయణ, ఒడ్డేటి నాని, నేరెళ్ళ అశోక్, కిరిమరే శ్యామ్‌రావు, లావణ్య, దంద్రే దివాకర్, నూలిగొండ మహేష్, అశోక్ ఆర్య, రాచర్ల మహేష్, కుమార స్వామి, నూలిగొండ రాజశేఖర్, దుర్గం ప్రశాంత్, సాయి భనార్కర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ-దహెగాం

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాస్పల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలంలోని కోత్మీర్ గ్రామంలో కళాజాతర బృందంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సుని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు స్కీమ్స్‌పై క్రాప్ లోన్ పొదుపు హౌసింగ్ లోన్ ఎడ్యుకేషన్ లోన్ గోల్డ్ లోన్ రుణమాఫ లపై ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలు సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన నగదు రహిత లావాదేవీలపై సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని మాటలు, పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా కళాజాత బృందం తెలియజేసింది. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సూర్య, సీఎస్పీ షకీల్, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

కౌటాల : ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం మండలంలోని కనికి గ్రామంలో ముత్తంపేట్ బ్యాంకు శాఖాధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం పొదుపు చేయడంలో పాటించే మెళుకువలు, సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ నిర్వహణ శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతు ఆధార్ అనుసంధానం చేసుకుని వేలిముద్రల సహాయంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిఎస్పి సెంటర్ల ద్వారా లావాదేవీలు చేసుకోవాలని, డిజిటల్ లావాదేవీలు జరిపేవారు తమ యొక్క పాస్‌వర్డ్‌ను ఎవరికీ తెలియజేయొద్దన్నారు. రైతులందరూ రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు సకాలంలో రుణాలను తీసుకుని నెలసరి సక్రమంగా కట్టాలని, బ్యాంకు ద్వారా లభించే రుణాన్ని మహిళ సంఘాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేష్, సీసీ విలాస్, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదు సంతోషకరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు అత్యధికంగ కావడం సంతోషకరమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కిమ్స్ ఆస్పత్రిలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యశాలను నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో పాటు సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొన్న వారిని సన్మానించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో 40 లక్షలపైన సభ్యత్వం నమోదు కాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 40 వేలకు పైగా సభ్యత్వ నమోదు పూర్తయ్యిందన్నారు. చురుకుగా సభ్యత్వ నమోదు చేసిన వారు క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రచారి, దోని శ్రీశైలంతో పాటు అన్ని మోర్చాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆయా మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టపాకుల దుకాణాల వద్ద సందడి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాకుల దుకాణాల వద్ద కొనుగోళు దారులతో సందడి నెలకొంది. దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ప్రశాంత్ దుకాణదారులకు సూచించారు.

ఆ అటవీ అధికారులను సస్పెండ్ చేయాలి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ పందిని హతమర్చరనే అనుమానంతో అమయాక ప్రజలపై దౌర్జన్యం, కండ్లకు గంతలు కట్టి చితకబాదిన సిర్పూర్ రేంజర్, సెక్షన్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని బెంగాలీ క్యాంపులో అటవీ కేసుల వల్ల జైలు పాలైన బాధితుల కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారుల అవినీతి వల్ల నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అడవి పంది కేసులో ఏడుగురిని రిమాండ్ చేశారని, రిమాండ్ చేసే ముందు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, కండ్లకు గంతలు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి చితక్కొట్టడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. అదుపులోకి తీసుకున్న తర్వాతవారిని కాగజ్‌నగర్ రేంజ్ ఆఫీసులో నిర్బంధించిన వారిని పరామర్శించడానికి వెళ్లిన వారిపై కూడా అక్రమంగా కేసులు బనాయించాలని పిటిషన్ ఇచ్చారంటే, ఫారెస్ట్ అధికారుల దాష్టీకాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. వెంటనే బెంగాలీ క్యాంపు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సిర్పూర్ రేంజర్‌లోని సిబ్బంది, రెబ్బెన సెక్షన్ ఆఫీసర్ ఇద్దరినీ సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ చీఫ్ కజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఈ విషయాలపై సమగ్రంగా లేఖ రాస్తామని అన్నారు. 48 గంటల్లో రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోకపోతే సిర్పూర్ రేంజ్ ఆఫీస్ ముందు వేలాది మందితో నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, సీనియర్ నాయకులు ఎల్ములే మల్లయ్య, ఒడ్డేటి నాని, నేరెళ్ళ అశోక్, మాజీ సర్పంచ్ గురుదాస్, కిరిమరే శ్యామ్‌రావు, దంద్రే దివాకర్, నూలిగొండ మహేష్, అశోక్ ఆర్య, కుమార స్వామి, నూలిగొండ రాజశేఖర్, గడి శేఖర్, దుర్గం ప్రశాంత్, సాయి భనార్కర్, మనోజ్ మండల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించేల తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని లోనవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల దుబ్బగూడం గ్రామంలో బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ మండలంలోని అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ ఇర్ఫాన్ హుస్సేన్, బీజేపీ మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, సీనియర్ నాయకులు నీరటి సత్యనారాయణ, అల్లూరి శ్రీశైలం, శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, మామిడి బాలాజీ, లావణ్య ఇప్ప అశోక్, కుమార స్వామి, కొండయ్య, సాయికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల పక్షం ప్రధాన లక్ష్యం : ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల పక్షం వహించి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వినతితో ఈఆర్సీ చైర్మన్ కరెంట్ బిల్లుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రూ.18500 కోట్ల భారం ప్రజలపై మోపకుండా ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంలో ఎప్పుడు ముందుంటామని, ప్రజలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న హామీలు, రైతు భరోసా, కౌలు రైతులకు రూ.12000 ఇస్తామని ఇచ్చిన హామీ, పింఛన్ల పెంపు, పూర్తిస్థాయి రుణమాఫీ, కల్యాణ లక్ష్మి పథకంలో మార్పులు ఇలా చెప్పుకుంటూ పోతే ఏది పూర్తి చేయలేక పోయిందని ఆరోపించారు. ఓవైపు ఉచిత విద్యుత్ అని ప్రకటిస్తూనే మరోవైపు విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపడానికి ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. గ్రామాల్లో ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని, తాము పర్యటనకు వెళ్ళిన సందర్భంలో అనేకమంది విన్నవిస్తున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ ఓకే గూటి పక్షులని, కాంగ్రెస్ చేసే తప్పులను బీజేపీ ప్రశ్నించడం లేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కరెంట్ బిల్లుల పెంపు విషయం తెలియదా, తెలిసి కూడా ఎందుకు ప్రశ్నించడం లేదని ఇదే వారి ములకత్‌కు సాక్ష్యమని అన్నారు. ఇప్పటికైనా నిజాన్ని ఒప్పుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్లు భీమేష్, బలరాం నాయక్, లక్ష్మణ్, బాబురావు, నాయకులు అహ్మద్, నిసార్, పార్టీ నాయకులు, మండల, పట్టణ, జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాస రావు



స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ డీవీ.శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

పోలీసులు, సిబ్బంది అంకితభావంతో పని చేస్తు ప్రజల మన్నలు పొందాలని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను ఎస్సై చంద్రశేఖర్‌ని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో రోజువారిగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుత వ్యవస్థని, విధుల పట్ల అంకితభావంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని గుర్తు చేశారు. ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రేవ్ కేసుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పటిష్ఠంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. రహదారి వెంట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ లావుడ్య ఉమేశ్వర్‌కు ఉత్తమ విధులకు ప్రోత్సాహకంగా నగదు రివార్డ్‌ను అందించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, రెబ్బెన సీఐ బుద్దె స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పని వేళల్లోనే కులగణన సర్వే చేపట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాఠశాలల పని వేళల్లోనే బీసీ కుల గణన సర్వే చేపట్టాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి జెడ్పీఎస్ఎస్‌లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మల్లూరి మంగయ్య సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీసీ కుల గణన సర్వే చేపట్టడం హర్షణీయమే అయిన దీనిని ఉపాధ్యాయులు పాఠశాలల పని వేళలు ముగిసిన తర్వాత చేపట్టాలని అనడం సరికాదన్నారు. ఇప్పటికే ఎస్ఎస్ తరగతులను పాఠశాలల పని వేళల అనంతరం తాము నిర్వహిస్తున్నామని, దీంతో పాటు బీసీ కుల గణన చేపట్టడం తమతో సాధ్యం కాదన్నారు. లేనిపక్షంలో బీసీ కులగణనను డిసెంబర్ నెల అనంతరం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన మల్లూరి మంగయ్య విద్యాబోధనలో అందరి మన్ననలు పొందాడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు యుఎన్.చారి, కాగజ్‌నగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, శ్రావణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు ఇందారపు ప్రకాష్, రాకేష్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

30 మంది ఆశ్రమ విద్యార్థినులకు అస్వస్థత



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. 30 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. వైద్యుడు వినయ్ ఆధ్వర్యంలో విద్యార్థునులకు పరీక్షించి చికిత్సలు చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం ఇంటి నుంచి తెచ్చుకున్న పిండి వంటకాలు తినడం వల్లనే ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థకు గురై ఉండవచ్చని పాఠశాల సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 30 మంది కూడా పిండివంటలు తిన్నారా అనే అనుమాలు కూడా తలెత్తుతున్నాయి.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేద్దామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద భీం వర్ధంతి ముగింపు సందర్భంగా విగ్రహ ఆవరణలో ఏర్పాటు చేసిన స్మారక జెండా పండుగకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాలవేసి జెండాకు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, భీం వారసులు కుమురం రాము, వెంకటేష్, సీతారాంలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసుల దశదిశ మార్చడానికి జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన గొప్ప వీరుడు భీంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 17న జోడేఘాట్‌లో ప్రారంభమైన భీం వర్ధంతి వేడుకలు ఆదివాసీ గూడలలో ఘనంగా నిర్వహించి జెండా పండుగతో ముగుస్తాయని తెలిపారు. అంతకుముందు భీం వారసుల కుటుంబ సభ్యురాలు చామంతి భీంకు ఇచ్చే ప్రత్యేక నైవేద్యాన్ని ఇంటి వద్ద నుండి భాజా భజంత్రీలతో తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, రాయి సెంటర్ అధ్యక్షుడు మడవి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు, ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతూ బుధవారం 200 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జూనియర్ కళాశాల నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కళాశాలలో 14 గ్రూపులుండగా, 707 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. 24 తరగతి గదులు అవసరం కాగా కేవలం ఎనిమిది తరగతి గదులు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ విద్యాసంవత్సరం నుండి ఎంపీసీ ఉర్దూ మీడియం తొలగించారని, సరైన వసతులు లేని కారణంగా ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి ముజామిలుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణనపై శిక్షణ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ అల్బర్ట్ అధ్యక్షతన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై పంచాయితీ కార్యదర్శులు, ఐకేపీ, రెవెన్యూ, ఈజీఎస్, ఐసీడీఎస్, ఆశ, ఏఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అల్బర్ట్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలు, విద్య అర్హతలు, వారి ఆర్థిక స్థోమతకి సంబంధిత వివరాలు, ప్రజా ప్రతినిధులుగా పని చేసిన వారి వివరాలు, వలస కార్మికులు, చిరు వ్యాపారులు, కులవృత్తులు చేస్తున్న వారు, ప్రజలు పొందుతున్న ప్రభుత్వ పథకాల వివరాలు, నీరు, విద్యుత్ సౌకర్యాల గురించి, కులం, మతం ఇతరత్రా అన్ని విషయాలను గ్రామ ప్రజల నుండి డాక్యుమెంట్స్ ద్వారా సేకరించి సర్వే చేసే అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎలాంటి పొరపట్లకు తావులేకుండా సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ నజురుల్లా ఖాన్, ఏఎస్ఓ దామోదర్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి



● భీమారం ఎస్సై శ్వేత

నవతెలంగాణ-జైపూర్

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని భీమారం ఎస్ఐ శ్వేత సూచించారు. భీమారం మండల పరిధిలో టపాసు దుకాణాల ఏర్పాటుకు ముందస్తుగా అనుమతి పొందాలని సూచించారు. నివాస గృహాలు, ఇతర షాపులు, జన సమూదాయాలు, గోదాములు ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. అనుమతి లేకుండా టపాసు విక్రయించినా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటింకపోయినా చట్ట ప్రకాం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన స్లేట్ విద్యార్థి

నవతెలంగాణ-జన్నారం



జిల్లా కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్‌లో ఈ నెల 29న నిర్వహించిన జిల్లా స్థాయి రెజ్లింగ్ టోర్నీలో స్లేట్ పాఠశాలకు చెందిన హర్మిత్ సాయి పదవ తరగతి విద్యార్థి అండర్-17 విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైయ్యాడని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని స్లేట్ హై స్కూల్ డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, ప్రిన్సిపాల్ శిరిన్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు బి సంతోష్, ఎం నగేష్, జ్యోష్న అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎండీ షాబొద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీల పరిధిలోని పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,521 ప్రకటించిందని, రైతులు మద్దతు ధర పొందాలంటే నిబంధనల ప్రకారం తేమ శాతం 8 శాతం నుండి 12 శాతం మధ్య ఉండాలని, 12 శాతం కంటే అధికంగా ఉన్నట్లయితే కొనుగోలు చేయడం జరగదని తెలిపారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలను అందించేందుకు 8897281111 నంబర్‌కు వాట్సాప్ బాట్ ప్రారంభించడం జరిగిందని, తద్వారా రైతులు క్రాప్ బుకింగ్‌లో ఉన్న డాటాను తమ ఇంటి వద్ద నుండే తెలుసుకోవచ్చని, పత్తి అమ్మకం, విస్తీర్ణం, పత్తి సాగు, అర్హత, తక్ పట్టి వివరాలు, సీసీఐ కేంద్రంలో ఇతర వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం నకలు ప్రతులు, ఆధార్‌తో అనుసంధానం చేసిన మొబైల్ నంబర్ తప్పకుండా తీసుకురావాలని తెలిపారు. రైతులు ఆధార్ సీడింగ్ బ్యాంక్ ఖాతాను ఇతర బ్యాంక్ ఖాతాకు సవరించేందుకు సంబంధిత బ్యాంక్ అధికారులను సంప్రదించాలని, దళారులకు పత్తిని విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని మద్దతు ధర పొందాలని తెలిపారు.

ఇద్దరు ఆదివాసీ ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అల్లినగర్ గిరిజన గ్రామానికి చెందిన ఉద్యోగస్తులైన డిప్యూటీ కలెక్టర్ రాయిసిడం చిత్రుపటేల్, టీచరు రాయిసిడం శ్రీహరిలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఉద్యోగాలు పొందిన డిప్యూటీ కలెక్టర్ చిత్రు, టీచరు శ్రీహరిలకు శాలువాలు కప్పి ఆదివాసీ నాయకులు ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ అత్రం హనుమంతరావు మాట్లాడుతూ, గిరిజనులు ప్రతి ఒక్కరు చదువుకోవాలన్నారు. చదువుకుంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. చదువు వల్లే సమాజంలో మంచి గౌరవం గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పేద్రం మని పటేల్, సిడం యశ్వంత్ రావ్, మని, కృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఇంధన్‌పల్లి విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం



ఈ నెల 29న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంచిర్యాలలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో ఇంధన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనభరిచి ప్రథమ స్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజేందర్, పీడీ శివనూరి తిరుపతి తెలిపారు. అండర్-17 విభాగంలో ఏ సాయి చరణ్ 10వ తరగతి, ఈ సాయి కుమార్ 9వ తరగతి, హర్షిత్ 9 తరగతి లు ప్రథమ స్థానంలో నిలిచి జోనల్‌కు ఎంపికైన్నారని, వీరు జోనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-మందమర్రి

రాష్ట్రస్థాయి ఉషూ క్రీడా పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సారా తస్లీమ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మార్వాడి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఉష క్రీడల్లో ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల విభాగంలో మందమర్రి ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. నవంబర్ 3వ తేదీన వరంగల్ జిల్లా తొర్రూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్లీమ్ తెలిపారు. 62కేజీ విభాగంలో చెవుల సన్నిత్ 9వ తరగతి, 55కేజీ విభాగంలో కొండా వంశీకృష్ణ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్ రంగు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పిల్లలపై లైంగికదాడులు, రక్షణ(పోక్సో) చట్టం కేసులను వేగవంతమైన విచారణ చేయడానికి ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ.రాంబావ్‌ను బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆయనను సన్మానించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటాన్ని బహుమతి గ అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండవరపు జగన్, ఎస్ఆర్ఏ అధ్యక్షులు న్యాయవాది డా. రాజలింగు మోతె, సీనియర్ న్యాయవాదులు ఎండి సంధాని, మురళీకిష్ణ,ముల్కల కనకయ్య, జూనియర్ న్యాయవాదులు మోతె రవికుమార్, శ్రీలత, ఎస్ఆర్ఏ సభ్యులు ఆడెపు సురేందర్, డి వెంకట్, హనుమండ్ల రమేష్, వేల్పుల వెంకటస్వామి పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

● జిల్లా వ్యాప్తంగా 98 దుకాణాలకు అనుమతి

● షాపు యజమానులు ముందస్తు చర్యలు పాటించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

దీపావళి వచ్చింది అంటే టపాసులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పండగ రోజు చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఆనందంగా టపాసులు కాలుస్తూ సందడి చేస్తారు. కాకరవతులు, ఆకాశంలోకి దూసుకుపోయే రాకెట్, భూ చక్రాలు, సిచ్చు బుడ్డిలతో ఇంటి వాతావరణం అంత పండగ సందడి నెలకొంటుంది. ప్రమాదాల భారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. అగ్ని మాపక శాఖ అధికారులు పట్టణంలో వెలసిన టపాసులు అమ్మే దుకాణాలు పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. టపాసుల స్టాళ్ల దుకాణాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు చేశారు.

నిబంధనలు.. జాగ్రత్తలు..

టపాసుల స్టాళ్లను ఎక్కడ పడితే అక్కడ ఏర్పటు చేయడానికి అనుమతి లేదు. మార్కెట్, జన సంచారం ఉన్న ప్రదేశాల్లో టపాసులు అమ్మితే చట్టరీత్య నేరం. స్టాళ్ళ ఏర్పాటుకు అగ్ని మాపక, పొలిసు అనుమతి తప్పని సారి, అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకుంటారు. జన సంచారం ఉన్న ప్రాంతాలు, ఇంటి ఆవరణలు, ఇరుకు గదుల్లో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆసక్తి ఉన్న వ్యాపారుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు తీసుకొని అనుభవం ఉన్న వ్యాపారులకు అనుమతులు ఇస్తారు. టపాసుల దుకాణాలు, గోదాముల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

నీరు, పొడి ఇసుక అగ్ని నియంత్రణ పరికరాలు ఉండేలా చూసుకోవాలి. దుకాణాల వద్ద సిగరెట్ తాగడం, దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడం లాంటివి చేయరాదు. వీలైనంతవరకు క్రీడా మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

నిబందనలు పాటించని వారిపై చర్యలు

మామిడి భగవాన్‌రెడ్డి, జిల్లా అగ్ని మాపక అధికారి



అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తాం. పండగ నేపథ్యం లో ప్రమాదాలకు అవకాశం లేని చోట స్టాళ్ల, గోదాములు ఏర్పాటు చేయాలి. షాపుల మధ్య తప్పని సరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలి. తాత్కాలిక లైసెన్సులు పొందిన వారు మాత్రమే బాణాసంచ వినియోగించానికి అర్హులు. ప్రమాదాలకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత



నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణలో భాగంగా నేతకాని కులస్తులను డి గ్రూప్‌లో చేర్చి ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నేతకాని మహర్ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ ఎస్సీ కులాల రిజర్వేషన్ వర్గీకరణను చేసే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టిన సందర్భంగా ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీం అత్తర్‌కి 8 పేజీలతో కూడిన వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాలలో వెనుకబడిన నేతకాని సామాజిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కులగణన చేసి మేమెంతో మకంతా ప్రకారం రిజర్వేషన్ కేటాయించే దిశగా మా జనాభా దామాషా ప్రకారం మమ్ములను ప్రత్యేకంగా గుర్తించి కేటగిరి డీలో చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా నేతకాని జాతి పెద్దలు, ప్రొఫెసర్ జాడి ముసలయ్య, ముడిమడుగుల శంకర్ ఆధ్వర్యంలో జేఏసీ రూపొందించిన నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ హైకోర్టు గవర్నమెంట్ ఫ్లీడర్ రత్నం రాజేష్ నేత, విద్యార్థి నాయకులు గోమాస రాజబాపు, రామాటెంకి కార్తీక్, సాయికుమార్, దుర్గం వినోద్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి

● డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి కిషన్

నవతెలంగాణ-జన్నారం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు ఐకేపీ సిబ్బందికి సమగ్ర సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, కుల, విద్యా, ఉపాధి, రాజకీయ అంశాలపై పూర్తిస్థాయిలో ప్రతి కుటుంబాన్ని సర్వే నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు వారికి సంబంధించిన అన్ని సమాచారాన్ని సర్వేకు వచ్చిన అధికారులకు అందించాలన్నారు. ఈ సమగ్ర కుటుంబ సర్వేని పగడ్బందీగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, పీఓపీఆర్డీ జలంధర్ పాల్గొన్నారు.



దండేపల్లి : సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని మండల ప్రత్యేక అధికారి రవీందర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఈజీఎస్, అంగన్‌వాడీ సిబ్బందికి ఇంటింటి సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సర్వేపై ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమనేటర్ ఉండేలా కసరత్తు చేస్తున్నామన్నారు. ఎన్యుమనేటర్ బ్లాక్ మ్యాపులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జెఆర్ ప్రసాద్, ఎంపీఓ సురేందర్, ఏఎస్ఓ సుమన్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై బుధవారం ఎన్యూమరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి 150 నుంచి 180 గృహాలకు ఒక ఎన్యూమరేటర్ను నియమించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే) సర్వే చేపట్టడం జరుగుతుందని, సంభందిత ప్రొఫార్మలో కుటుంబాల వివరాలు నమోదు చేయాలని, అట్టి వివరాలను కంప్యూటరు ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సఫ్దర్ అలీ, సూపరిడెండింట్ లక్ష్మయ్య, ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దీపావళి పండుగకు విభిన్న ప్రమిదలు

● ఆకట్టుకుంటున్న వెరైటీ ప్రమిదలు ● కొనుగులుకు ప్రజల ఆసక్తి ● మార్కెట్ అంతా దీపావళి శోభ



నవతెలంగాణ-మంచిర్యాల

దీపావళి పండుగ నేపథ్యంలో మార్కెట్‌లో వివిధ రకాల ప్రమిదలు పట్టణ వాసులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ రకాల ప్రమిధలను, రంగు రంగుల బల్బులను, విద్యుత్ కాంతితో ఉన్న వివిధ రకాల పరికరాలను కొనడానికి పట్టణ వాసులు ఆసక్తి చూపిస్తున్నారు. సాంకేతికత రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో కొత్త రకం దీపాలు విద్యుత్‌తో వెలుగే దివ్వెలు అందుబాటులోకి వచ్చాయి. విభిన్న రకాల దీపాలు మార్కెట్‌లో ఉండడంతో ప్రజలు ఆయా దీపాల పట్ల ఆకర్షితులవుతున్నారు. ఇల్లు అంత సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుకుంటున్నారు. దీపాలతో నగర వాసులు. కాస్త ఖరీదైనప్పటికీ ఆకర్షణీయంగా ఉండే దీపాలను కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఒకప్పుడు అంత మట్టి దీపాలు ఉండేవి కానీ ఇప్పుడు మట్టితో పాటు పింగాణీ, రాగి, విద్యుత్ శక్తితో నడిచే దీపాలు అందుబాటులోకి వచ్చాయి. దీపావళి రోజు లక్ష్మి పూజలు నిర్వహిస్తారు. అందుకే దీపావళి రోజు ఇంటిని దీపాలతో అలంకరిస్తే పండుగ శోభాతో పాటు లక్ష్మి దేవి కటాక్షం కలుగుతుందని భావిస్తున్నారు. మహిళలు .దీపావళితో పాటు కార్తీక మాసం కూడా మొదలవుతుండడంతో పెద్ద మొత్తంలో దీపాలు కొనేందుకు వస్తున్నారు.



బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

నవతెలంగాణ-తాండూర్

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని బొగ్గు బ్లాక్ ల వేలం పాట రద్దు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దాగం రాజారాం కోరారు. బుధవారం సీపీఐ(ఎం) నాయకులతో కలిసి సింగరేణి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రాబోయే కాలంలో సింగరేణి బొగ్గు బ్లాకులు క్రమంగా మూతపడే పరిస్థితి ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వేలంపాట విధానం తీసుకువచ్చిందన్నారు. వేలంలో కార్పొరేటర్ల పోటీ వల్ల సింగరేణికి బొగ్గు బావులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. వేలంలో సింగరేణి బొగ్గు బ్లాకులు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళితే కార్మికుల భవిష్యత్తు అందాకారంలోకి వెళుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రమాదంలో పడుతుందనన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం ప్రజా సంఘాలు, ఉద్యోగులు, కార్మికులు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సింగరేణి పరిరక్షణ కోసం వామపక్ష పార్టీలు ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, నర్సయ్య నాయకులు పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్ విన్నర్స్‌గా మందమర్రి గ్రూపు



నవతెలంగాణ-మందమర్రి

నియర్ బై హాకి టోర్నమెంట్ విన్నర్స్‌గా మందమర్రి, రన్నర్స్‌గా బెల్లంపల్లి గ్రూప్‌లు నిలిచాయి. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో సింగరేణి వార్షిక క్రీడల్లో భాగంగా బుధవారం సింగరేణి హై స్కూల్ మైదానంలో నియర్ బై హాకీ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్టోర్ ఇన్‌చార్జి పైడి ఈశ్వర్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సర్యనారాయణ పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ సి అండ్ ఎండి బలరాం నాయక్ ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారని, సీనియర్ క్రీడాకారులు యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమమంలో క్రీడల కార్యదర్శి కార్తీక్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కంది శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బాణయ్య, గాండ్ల సంపత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్ శివ కృష్ణ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చదరంగం అండర్-14, 17 జోనల్ పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

చదరంగం అండర్-14,17 జోనల్ స్థాయి చదరంగం పోటీలను నల్లుల శివ సౌజన్యంతో నవంబర్ 5వ తేదీన లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొనారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్నారు. పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తారని తెలిపారు. అండర్-14, 17 విభాగాల నుంచి 5 మంది క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని సీహెచ్ ఫణిరాజ్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్, రాష్ట్ర చెస్ ఉపాధ్యక్షులు, దామెర్ల సిద్దయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఈగ కనకయ్య ఉమ్మడి జిల్లా చెస్ చైర్మన్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తమ వెంట బోనోఫైడ్, ఆధార్, ఎస్‌జీఎఫ్ ఎలిజిబిలిటీ ఫామ్స్ నాలుగు సెట్స్ తీసుకురావాలని తెలిపారు. క్రీడాకారులకి ఉచిత భోజన సదుపాయం ఉంటుందని, చెస్ సెట్స్ ఎవరు కూడా తీసుకు రాకూడదని పాఠశాలలోనే చెస్ బోర్డ్స్ ఏర్పాటు చేయండం జరుగుతుందని సూచించారు. వివరాలకు చీఫ్ అర్బయిటర్ అంబాల కల్పనా, ఏ కుమార్ పీఈటీ 8978146456లను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బీర్యాకారి ప్రవీణ్ బాబు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌కు చెందిన బీర్యాకారి ప్రవీణ్ బాబు కాంగ్రెస్ అనుబంధ సంస్థ జవహర్ లాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమతులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ నేషనల్ చైర్మన్ జీవీ హరి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ప్రకటించారు. తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర, జాతీయ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో అందరూ సమానమే : జిల్లపెల్లి వెంకటేశం

నవతెలంగాణ-నస్పూర్



సమాజంలో అందరూ సమానమే అని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లపెల్లి వెంకటేశం అన్నారు. బుధవారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఆర్ఐ చందర్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానంగా చూడాలని ఎలాంటి వివక్ష చూపకుండా అందరితో సోదరాబావంతో మెలగాలని అన్నారు. కాలనీ సమస్యలు లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని, సివిల్ రైట్స్ డే గురించి వివరించారు. అనంతరం ఏఎస్‌డబ్ల్యూఓ రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో వసతి గృహాలు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అడ్మిషన్స్, కులాంతర వివాహాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ కుమారస్వామి, ఎమ్మార్పీఎస్ దశరథం పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికునికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



ఖైరిగూడ ఓపెన్ కాస్ట్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన షేక్ హైమద్‌ని సత్కరించారు. బుధవారం అధికారులు ఆయన్ను శాలువతో సత్కరించి శేషజీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శిలు శేషు, దేవరకొండ దివాకర్, సహాయ కార్యదర్శి, మాల ఓదెలు, నాయకులు, కె రాజన్న, సత్యనారాయణ, అల్లాడి కోటి, ధర్మయ్య, కుమారస్వామి, పొట్ట రమేష్, కోదూరు రమేష్, కుమారస్వామి, దిలీప్, రామ్ కిషన్, సుధాకర్, మోసం గోపాల్, రాజ్ కుమార్, రాజలింగు, సుదీర్, సల్లూరి అశోక్ పాల్గొన్నారు.

జంతువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కౌటాల



జంతువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని వీర్దండి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. నాలుగు సంవత్సరాల పైబడిన పశువులకు గేదెలకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు మీ జంతువులకు ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యాధి సోకిన పశువులకు ఉచితంగా టీకాలు వేసి వాటి రక్షణ కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, ప్రకాష్, శోభన్, బిక్షపతి, రైతులు ఉన్నారు.

అసంపూర్తిగా ప్రధాన రహదారి పనులు



నవతెలంగాణ-వేమనపల్లి

నీల్వాయి ప్రధాన రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని మొరంకు బదులు సుద్ద మట్టి పొస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆరోపించారు. నీల్వాయి-చెన్నూర్ ప్రధాన రోడ్డు మార్గం పనులు ఎట్టకేలకు వారం రోజుల కిందట ప్రారంబించారు. మొరం పోయాల్సిన చోట మొరంకు బదులుగా సుద్ద మట్టి పోయడంతో బుధవారం కురిసిన చిన్నపాటి వర్షానికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందనీ, కాలినడకన సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని రోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపించి ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందనీ అన్నారు. ప్రధాన రోడ్డు మార్గం పనులు చేసేటప్పుడు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి కానీ అలాంటి దేమి లేకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండా వాహనదారులకు, కాలినడకన వెళ్లి వారికి ఇలా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కోట్ల రూపాయల పనులు చేస్తున్నప్పుడు నిరంతరం పర్యవేక్షణ చేయాలనీ ప్రజల పక్షాన, భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-కెరమెరి

నవంబర్ ఆరు నుండి 19 వరకు చేపట్టే సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ అంజద్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సామాజిక ఆర్థిక కుల విద్యా ,రాజకీయ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రతి ఎనిమరేటర్ 175 ఇండ్లకు సంబంధించిన వివరాలను పూర్తి చేయాలన్నారు. నవంబర్ 1, 2 తేదీలలో గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న ఇండ్ల వివరాలను సేకరించాలన్నారు. సర్వేలో భాగంగా 57 రకాల వివరాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 15 ఇండ్లను పూర్తి చేయాలన్నారు. మండలంలో 26 గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఐదుగురు సీసీలు, ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు కుటుంబ సర్వేలో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రావు పాల్గొన్నారు.

అజిత్ సీడ్స్ పత్తి పంట క్షేత్రపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-సారంగాపూర్

మండలం స్వర్ణ గ్రామంలో రైతు గుమ్ముల రాజు సాగుచేసిన అజిత్ సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వెరైటీ ఏసీహెచ్ 1199 నూతన పత్తి రకంపై అజిత్ సీడ్స్ కంపెనీ జోనల్ మేనేజర్ ఇంద్రసేనారెడ్డి, ఏరియా మేనేజర్ వేణు, సేల్స్ ఆఫీసర్ భూషణ్ రాకేష్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ అజిత్ సీడ్స్ వారి పత్తి రకం ఏసీహెచ్ 1199 ఏపుగా పెరిగి అన్ని రకాల వాతావరణ పరిస్థితిలను, చీడపీడలను సమర్ధవంతంగా తట్టుకొని, ఒక్క మొక్కకి సుమారు 80 నుంచి90 కాయలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఇలాంటి అధిక దిగుబడినిచ్చే పత్తి వెరైటీని ఎన్నుకోవాలని సూచించారు. రైతుకు అధిక దిగుబడి వచ్చేలా ఈ అజిత్ సీడ్స్ ప్రభావం చూపిందని తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామస్తులు, కంపెనీ ప్రతినిధులు, ఫర్టిలైజర్ యజమానులు పాల్గొన్నారు.

సర్వేలో ప్రతి 150 కుటుంబాలకు ఎన్యూమరేటర్

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి గణపతి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఎన్యూమరేటర్ల సర్వే నిర్వాహణ తీరుపై అవగాహణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కుటుంబాల వారిగా ఇంటింటి సర్వే ద్వార సేకరించిన సమాచారం అందుకు సంబంధించిన ప్రొఫార్మల్లో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా సర్వే ద్వార చేపట్టిన వివరాలను ఎప్పకప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలని, షెడ్యూల్ ప్రకారం సర్వే నిర్వాహణ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.



జోగు రామన్న నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్ సవాల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ వ్యాప్తంగా రాష్ట్రాల్లో సీసీఐ పత్తికి మద్దతు ధర ఒకే విధంగా ఉంటుందని, ఒకవేళ బీఆర్ఎస్ ఆరోపిస్తున్నట్లు గుజరాత్‌లో ఆదిలాబాద్ కంటే పది రూపాయలు ఎక్కువ మద్దతు ధర ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ మాజీమంత్రి జోగురామన్నకు సవాల్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న చేసిన ఆరోపణలపై స్పందిస్తు మాట్లాడారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధర సీసీఐ ఎక్కువగా ఇస్తుందని మాజీ మంత్రి చెప్పారన్నారు. ఈ విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఎం చేస్తున్నారని ప్రశ్నించారన్నారు. మాజీ మంత్రితో పాటు రైతులకు కూడా గుజరాత్ రాష్ట్రానికి తీసుకెళ్తామని అక్కడ ఇక్కడి నుంచి పది రూపాయలు ఎక్కువగా ఉన్న కూడా అక్కడి నుంచే తన రాజీనామాను పంపుతానని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో జోగు రామన్న రైతులకు ఇబ్బందులు పెట్టారని ఫోటోల ద్వారా చూపించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా చేసిన రామన్న హుందాగా మాట్లాలని హితవు పలికారు. గడిచి ఐదేండ్లలో రూ.5726 నుంచి రూ.7521 పత్తికి మద్దతు ధర పెంచడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు మాయూర్ చంద్ర, కృష్ణ, రవి పార్టీ నాయకులున్నారు.

ఎమ్మెల్యే ఆరోపణలు చేయడం హాస్యాస్పదం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోళ్ళ విషయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. కొనుగోళ్ళ సమయంలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే పార్టీ సమావేశాలకు వెళ్ళిన ఎమ్మెల్యే తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే పాల్ శంకర్ ప్రయివేట్ వ్యాపారుల పక్షాన కాకుండా రైతుల పక్షాన ఎమ్మెల్యేగా నిలబెడితే బాగుంటుందని హితవు పలికారు. పత్తి పంట కొనుగోలు సమయంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని, ప్రతి రాష్ట్రంలో ఒక్కో రకం పత్తికి ఒక్కో ధర చెల్లిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రయివేట్ వ్యాపారస్తులు పత్తికి అధిక ధర చేల్లిస్తుంటే జిల్లాలో మాత్రం ఆ పద్ధతి ఎందుకు లేదన్నారు. ఇదే విషయాన్నీ సీసీఐ అధికారులు, కలెక్టర్ వద్ద సైతం ప్రస్తావించడం జరిగిందన్నారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉండడం తమ వల్ల కాదన్న ఆయన వారికోసం ఎక్కడివరకు వెళ్లడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రైతులు నిండా మోసపోతుంటే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇదే విషయాన్నీ ప్రశ్నిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ధర దక్కలేదన్న ఆందోళనతో ఈఏడు కిసాన్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులకు భోజన వసతి సైతం కల్పించామని గుర్తు చేశారు. రాత్రిపూట దొంగచాటుగా వచ్చి వ్యాపారస్తులతో ఎమ్మెల్యే ఏ ఒప్పందం కుదుర్చుకున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రౌతు మనోహర్, రోకండ్ల రమేష్, యాసం నర్సింగరావు, మెట్టుప్రాలద్, గంద్రత్ రమేష్, సేవ్వా జగదీష్, వేణు యాదవ్, కుమ్రా రాజు, పరమేశ్వర్, బట్టు సతీష్, విట్టల్, కలీం, రాజు సిద్ధార్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈజ్‌గాం అల్లర్లకు కారకులైన ముగ్గురి అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం విలేజ్ నెంబర్ 5లో ఈ నెల 26న జరిగిన అల్లర్లకు కారణమైన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రామానుజం తెలిపారు. విలేజ్ నెంబర్ 5కు చెందిన మనీష్ మాణిక్‌దాస్, దేబాశిష్ మండల్, బుద్దేశ్వర్‌రాయ్‌లను ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోక తప్పదని, సమస్యలుంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలే కాని అల్లర్లకు పూనుకోవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించినవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

గుజరాత్ పర్యటనకు బృందాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పత్తి రైతులు గూడుగోన విధానంతో తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గుజరాత్ తరహాలో ఆదిలాబాద్ పత్తి రైతులకు పత్తి ధరను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. గుజరాత్ పర్యటనకు సైంటిస్టులతో పాటు ప్రత్యేక బృందాన్ని ఇప్పించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రౌతు మనోహర్, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్, సేవ్వా జగదీష్, కుమ్రా రాజు, వేణు యాదవ్, పరమేశ్వర్ ఉన్నారు.

మిల్లు సమస్యను పరిష్కరించండి

- డీఎస్పీని కోరిన కార్మికులు, ఉద్యోగులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లుకు, స్థానిక లారీ అసోషియేషన్‌కు మధ్య కొనసాగుతున్న వివాదాన్ని వెంటనే పరిష్కరించి మిల్లులో పేపర్ ఉత్పత్తి సాఫీగా కొనసాగేలా చూడాలని కోరుతూ మిల్లు కార్మికులు, ఉద్యోగులు బుధవారం కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజంకు వినతిపత్రం ఇచ్చారు. ముందుగా కార్మికులు మిల్లు నుండి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. లారీ యాజమానుల సమ్మె కారణంగా మిల్లులో పేపర్ నిల్వలు పేరుకుపోతున్నాయని, ఆర్డర్లు లేక మిల్లు తీవ్ర నష్టాలలో కొనసాగుతోందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. లారీ అసోషియేషన్ పేరుతో కొంతమంది ప్రతి రోజు యార్డు వద్దకు వచ్చి ముడిసరుకు లారీ డ్రైవర్లను బెదిరిస్తుండడంతో సరుకు రవాణలో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కంపెనీపై సుమారు 2,500 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, వీరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పసి పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలలో పౌష్టికాహారం అందడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఐసీడీఎస్ సిబ్బందితో పాటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యత జిల్లాలో ఎంతో ఉందని అంగన్‌వాడీ కేంద్రాలలో పసి పిల్లలు, గర్భిణులకు నాసిరకమైన కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు, ఇస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అధికారుల స్పందించి వెంటనే కేంద్రాల పర్యవేక్షణ చేసి సరి చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

గుండె నొప్పితో ఒకరి మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలం కేంద్రానికి చెందిన మణిక్‌రావు(45) గుండెనొప్పితో మృతి చెందారు. మంగళవారం రాత్రి గుండెనొప్పి రావడంతో చంద్రపూర్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-కౌటాల

విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎన్ మధుకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలని, మంచి మార్గంలో నడవాలన్నారు. తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల బాలుర, బాలికల పాఠశాల, కళాశాలలో అతిథి అధ్యాపక, ఉపాధ్యాయ ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి డి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ బాలికల రెబ్బనలో అధ్యాపక అతిథి ఆంగ్లం 1, పీజీటీ ఆంగ్లం1, మ్యూజిక్, సాంఘిక సంక్షేమ గురుకుల కాగజ్‌నగర్ బాలికల పీజీటీ ఫిసికల్ సైన్స్ 1, మ్యూజిక్ 1, సాంఘిక సంక్షేమ సిర్పూర్(టి) బాలికలులో టీజీటీ ఫిసికల్ సైన్స్ 1, టీజీటీ బయాలజీ 1, పీజీటీ బయాలజీ, సాంఘిక సంక్షేమ సిర్పూర్(టి) బాలురలో అధ్యాపక కామర్స్ 1, లైబ్రరియన్ 1, ఆర్ట్ టీచర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు పైన తెలిపిన సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ సంప్రదించాలని సూచించారు. నవంబర్ రెండవ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మొబైల్ 9963374494ను సంప్రదించాలన్నారు.

రిమ్స్ డైరెక్టర్ ను కలిసిన మాల సంఘం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను బుధవారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. పూలమాల బొకే అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ పేద వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంలో డైరెక్టర్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఇక ముందు కూడా పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మేకల మల్లన్న, బేర దేవన్న, సూరం భగవాన్లు, నల్ల రాజేశ్వర్, ముల్కల రాజేశ్వరి, ఏరా సుధీర్, పాశం రాఘవేంద్ర, మలపతి సుభాష్, రవి పాల్గొన్నారు.

బీజేపీ క్రీయాశీల సభ్యత్వాలు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో క్రీయాశీల సభ్యత్వాలను ప్రారంభించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌కు క్రీయాశీల సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ సభ్యత్వం కొనసాతుందన్నారు. వంద సభ్యత్వాలు కార్యకర్తలు వారి రేఫరల్ ద్వారా నమోదు చేస్తే వారికి క్రీయాశీల సభ్యత్వాలు అందిస్తామన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 592 బూత్‌లున్నాయని తెలిపారు. బూత్‌లకు ఒకటి, మండలాలకు 50, పట్టణానికి 100 చొప్పున లక్ష్యం ఇచ్చారని తెలిపారు. సాదారణ సభ్యత్వానికి నవంబర్ పదవ తేది వరకు అవకాశం ఉందని తెలిపారు. కార్యకర్తలు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, లాలామున్న, ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, ఆధినాథ్, విజయ్ బోయర్, క్రిష్ణయాదవ్ పాల్గొన్నారు.

గుండ్లపాడ్ రోడ్డు ధ్వంసం

- భారీ వాహనాల రాకపోకలతో మట్టి రోడ్డుగా మారిన బీటీ రోడ్డు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గుండ్లపాడ్ రహదారి భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండ్లపాడ్ గుట్టను తవ్వి మొరం తరలిస్తుండగా భారీగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో మంచిగా ఉన్న రోడ్డు కాస్త పూర్తిగా ధ్వంసం అవుతుంది. బీటీ రోడ్డు కాస్త ధ్వంసమై మట్టి రోడ్డుగా మారిందంటే రోడ్డు ఏ మేరకు ధ్వంసమైందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రకృతి సహజ వనరులతో ఉన్న గుండ్లపాడ్ గుట్టకు మొరం తరలించేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడంపై పలు విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మొరం తరలింపు వాహనాలతో రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసమై రూ. లక్షల రోడ్డు ధ్వంసం అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండి పడుతున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏజెన్సీలో ఆహారకల్తీపై పర్యవేణేదీ..?



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో డెంగ్యూ కలరా, డయేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో మృత్యు వాతపడటం నిత్యకృత్యమైన సందర్భంలో ఏజెన్సీ ప్రాంతంలో స్ట్రీట్ ఫుడ్ కల్తీపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షణ చేయాలనీ జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కాంబ్లె ప్రజ్ఞశీల్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలే మయోనిస్, మండి తినడం ద్వారా అనేక మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. దేశాలలో నిషేధిత ఆహార పదార్థాలు మన దేశంలో యధేచ్ఛగా వాడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి కల్తీ ఆహారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జాడి వెంకటేష్, కృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు.

ఖండేష్కర్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖండేష్కర్ ఆధ్వర్యంలో ఓ దివ్యాంగునికి వీల్‌చైర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. మరెన్నో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



నవతెలంగాణ-బెజ్జూర్

ఇటీవల ప్రాణహిత నదిలో మృతి చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులకు అండగా ఉండి వారికి ఆదుకుంటామని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఘటన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామని కుటుంబాలకు హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద కొంత ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, మండల అధ్యక్షులు బుస శంకర్, నాయకులు జాహిద్ హుస్సేన్, జవీద్ అలీ, మాజీ ఉపసర్పంచ్ నికడి బాపురావు, నాయకులు ఫైసల్ బిన్ సులేమాన్, పుల్లూరి సతీష్, హకీమ్, నరేంద్ర గౌడ్, షాహిద్, హన్మంతు, మురళీ గౌడ్, మహిళా నాయురాలు సబియా, అమృత, సునీత, కార్యకర్తలున్నారు.

నాలుగు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దీపావళి పండగను పురస్కరించుకుని ఆదిలాబాద్‌లో నాలుగు రోజుల పాటు పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ బుధవారం ప్రకటనలో పేర్కొంది. అక్టోబర్ 31 నుండి నవంబర్ 3 వరకు నాలుగు రోజుల పాటు యార్డులో సీసీఐ, ప్రయివేటు పత్తి కొనుగోళ్ళు జరుపబడవని తెలిపారు. తిరిగి నవంబర్ 4 నుండి కొనుగోళ్ల ప్రారంభమవుతాయన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

నాలుగు రోజులు సోయాబీన్ కొనుగోలు బంద్

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సంఘాల ద్వారా జిల్లాలో మద్దతు ధరతో చేపడుతున్న సోయాబీన్ కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి పండగ సందర్భంగా సోయాబీన్ కొనుగోలును నవంబర్ 3 వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 4 నుంచి యధావిధిగా కొనుగోలు పున్నప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు.

నవదోయ దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యాలయంలో 9 మరియు 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు తేదీని పొడిగించినట్లు విద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కె.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందు నిర్ణయించిన ప్రకారం దరఖాస్తు గడువు తేదీ అక్టోబర్ 30 వరకు ఉండగా, దీనిని నవంబర్ 9వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.